క్లుప్తంగా

ఢిల్లీలో శిక్షణ తరగతులకు శావల్యాపురం తహసీల్దారు

శావల్యాపురం: స్థానిక తహసీల్దారు వేముల వెంకట నాగరాజు ఢిల్లీలో జరుగుతున్న విపత్తుల శిక్షణ తరగతులకు వెళ్లారు. మూడు రోజులు పాటు జరగనున్న శిక్షణ తరగతులు ముగించుకొని మళ్లీ ఈనెల 9న విధుల్లోకి హాజరు కానున్నారు. అప్పటి వరకు వినుకొండ తహసీల్దారు సబ్‌వత్ సురేష్ నాయక్ ఇన్‌చార్జ్ బాధ్యతలు వ్యవరిస్తారని డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య బుధవారం తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

శావల్యాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభ్యున్నతిలో దాతలు సహకారం అభినందనీయమని శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ శావల్యాపురం గ్రామానికి చెందిన మంచికలపూడి రామకృష్ణతన కుటుంబ సభ్యులు (ప్రవాసా భారతీయులు) సహకారంతో రూ. 30 వేలు విలువ చేసే ఆధునిక వైద్య పరికరాలు ఫ్రీజు,ఆయాసంతో బాధపడే రోగులకు పరికరం, బీపీ ఆపరేటర్ పరికరం వితరణ చేసినట్లు తెలిపారు. అలాగే శావల్యాపురం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రెడ్డి కృష్ణ-లక్ష్మి దంపతుల కుమార్తె భార్గవి (ఎంబీబీఎస్) వైద్యురాలు తన వంతు సహకారంగా 9 ఫ్యాన్లు వితరణ చేశారు ఈ కార్యక్రమంలో వైద్యులు రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, విశ్రాంతి ఉపాధ్యాయులు అరిగేల యోగయ్య, గ్రామస్తులు లోమడ చెన్నుబాబు, శ్రీనివాససింగ్, అంబటి వెంకటేశ్వర్లు, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్న, ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నిషన్స్ సతీష్, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



చిలకలూరిపేట: ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనివాసం ఫంక్షన్ హాలులో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 72 మంది శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని బాపూజీ, సాయి ప్రశాంతి వృద్ధాశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు. ఎన్‌ఆర్‌టీ రోడ్డులోని కోండ్రుపాడు వద్ద రోడ్ల పక్కన నివాసం ఉండే వారికి అన్నదానం నిర్వహించి, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లెల కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, జాలాది సుబ్బారావు, బిట్రా రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- నరసరావుపేటలో పౌష్టికాహార మాసోత్సవం



పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: పౌష్టికాహారంతో పాటు వ్యాయామం ద్వారా పిల్లల్లో మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరగడంతో పాటు రక్తహీనత తగ్గుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొని స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన 30వ తేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం ఈ మాసోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా రక్తహీనతపై అవగాహన కల్పించడంతో పాటు రక్త పరీక్షలు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఉమారాణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం రవ్వవరం గ్రామంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు వినుకొండ సీడీపీవో అనురాధ ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నూజెండ్ల సెక్టార్ సూపర్‌వైజర్ విన్యాసమ్మ, హెచ్‌ఎం గల్లా కృష్ణారావు పాల్గొని మాట్లాడుతూ పోషకాహార విలువల గురించి, గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల తల్లులకు వంటలు చేసి చూపించి వివరించడం జరిగింది.

మునుమాకలో కూరగాయల తోటల పరిశీలన



కూరగాయల తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి ఎం. అశోక్‌రెడ్డి

రొంపిచర్ల: మండలంలో కూరగాయల పంటలు సాగు చేస్తున్న మునుమాక గ్రామంలోని తోటలను ఉద్యాన అధికారి ఎం. అశోక్‌రెడ్డి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయల పంటల సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. కాపుతో ఉండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల చుట్టూ మట్టిని చేర్చాలన్నారు. ఒకవేళ ఉరక దెబ్బ తిని మొక్కలు చనిపోయినట్లు అయితే ఆ స్థానంలో కొత్త మొక్కలు నాటుకోవాలన్నారు. అధిక శాతం మొక్కలు చనిపోయినట్లు అయితే ఆ పంటను పూర్తిగా తొలగించి తిరిగి అనుకూలమైన పంటను సాగుచేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పంట కాపాడుకోవచ్చు

నరసరావుపేట రూరల్: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రధాన పంటలైన వరి, పత్తి, మిరపతో పాటు ఇతర పంటలపై ఎకరాకు 100 కేజీల ఘన జీవామృతం, 50 కేజీల వేపపిండితో కలిపి భూమికి పిచికారీ చేయాలని తెలిపారు. దీని వలన మొక్కలకు కావల్సిన అన్ని రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రక్షక పంటల ద్వారా మిత్రపురుగుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. దీంతో పాటు పత్తిని ఆశించే గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గుతుందని తెలిపారు. గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, జిల్లా ఎస్‌ఎఫ్ ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కాల్వలను పరిశీలించిన ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ

రొంపిచర్ల: మండలంలోని నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ సాగు నీటి కాల్వలను ఎస్‌ఈ డి. వరలక్ష్మీ, డీఈ సి.హెచ్. రామారావులు బుధవారం పరిశీలించారు. రైతుల సాగు అవసరాల మేరకే కాల్వలకు నీరు సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. సాగుకు నీరు అవసరం లేని కాల్వలకు నీరు నిలుపుదల చేయాలన్నారు. ఎవరైనా రైతులు నీరు కావాలని అడిగితే వెంటనే సరఫరా చేయాలన్నారు. వర్షాలు వల్ల కాల్వ గట్లు బలహీనపడే అవకాశం ఉందని, అలాంటి కాల్వలకు వాటర్ తగ్గించి సరఫరా చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని ఎస్‌ఈ డి. వరలక్ష్మీ సూచించారు. ఈ సందర్భంగా తంగేడుమల్లి మేజర్, రొంపిచర్ల మేజర్, అన్నవరం మేజర్ కాల్వలను వారు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో పోట్లూరు వాసి మృతి

శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన వినుకొండ రూరల్ పరిధిలో వెంకుపాలెం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన అబ్బూరి అంజయ్య, తన స్నేహితుడు చింతా సతీష్‌లు ఇరువురు బైకుపై ప్రకాశం జిల్లా పుల్లలచెరువు గ్రామంలో తన బంధువులు ఇంటికి వెళ్లారు. మార్గమధ్యంలో వెంకుపాలెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా సంఘటన స్థలంలో అబ్బూరి అంజయ్య (50) మృతి చెందాడు. చింతా సతీష్‌కు తీవ్రగాయాలు కాగా అటు నుంచి వెళుతున్న ప్రయాణికులు చూసి సత్వరమే 108 అత్యవసర వాహనానికి సమాచారం అందిచడంతో సిబ్బంది వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ కార్యదర్శికి గాయాలు

నాదెండ్ల: గణపవరం నాలుగో సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న జ్యోతిర్మయి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఉదయం 9 గంటల సమయంలో తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై గుంటూరు నుండి గణపవరం వస్తుండగా యడ్లపాడు ఫ్లైఓవర్ వద్ద జీవాల మందను తప్పించే క్రమంలో అదుపుతప్పి క్రిందపడింది. దీంతో ఆమెకు గాయాలు కాగా, చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఆమె కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

నాదెండ్ల: యడ్లపాడు మండలం కారుచోల గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. గ్రామ పరిధిలోని రేకుల షెడ్డులో కోత ముక్క ఆడుతున్నారన్న సమాచారంతో యడ్లపాడు ఎస్సై వి.బాలకృష్ణ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఈ దాడిలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ.7260లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

స్కూటీ అపహరణపై కేసు నమోదు

చిలకలూరిపేటటౌన్: అల్పాహారం కోసం ఓ దాబా హోటల్ ఎదురుగా ఉంచిన స్కూటీ మాయమైంది. దీంతో వారంరోజులు వెతికి ఎంతకూ ఆచూకీ లభించక పోవడంతో పోలీసులను ఆశ్రయించాడు బాధితుడు. వివరాల్లోకి వెళితే.. గతనెల 28వ తేదీన మార్టూరుకు చెందిన షేక్ గులాంఅలీ చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న ఓ దాబా హోటల్ ఎదురుగా తన స్కూటీని నిలిపి అల్పాహారం చేసి బయటకు వచ్చి చూడగా అతని వాహనం కనిపించలేదు. వాహనం కోసం అప్పటి నుంచి అన్నిచోట్ల వెతుకులాట ప్రారంభించాడు. ఫలితం లేకపోవడంతో చివరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులను ఆశ్రయించి తన గోడు వినిపించుకున్నాడు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతా దందాలమయం

- కోడిపందేలు, పేకాట శిబిరాలు, రేషన్ బియ్యం, మున్సిపాల్టీలలో ఎమ్మెల్యే అరవిందబాబు హస్తం
- కొడుకు, బంధువులు, నాయకులచే వ్యవహారం
- తనపై ఆరోపణలు రుజువు చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి డిమాండ్



నరసరావుపేట: నియోజకవర్గాన్ని కేవలం మూడునెలల కాలంలో పేకాట, కోడిపందేలు, మద్యం, ఇసుక, రేషన్ బియ్యం, గ్రానైట్ లారీలు, రియల్‌ఎస్టేట్ దందాలకు నిలయంగా కూటమి ప్రభుత్వ నాయకుడు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మార్చాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుంటూరురోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్చంపాలెం గ్రామంలో ఎమ్మెల్యే అరవిందబాబు కుమారుడు బావమరిది విజయ్ అనే వ్యక్తి స్వయంగా కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా కోడిపందేలు ప్రారంభించటం నరసరావుపేటలో ఒక చరిత్ర అన్నారు. రోజుకు ఒక లక్ష రూపాయల వసూలే లక్ష్యంగా కోడిపందేల శిబిరం ప్రారంభించారన్నారు. పట్టుకునేందుకు పోలీసులు వెళితే మీకు లక్ష ఇస్తున్నాం కదా.. మీరెందుకు వచ్చారంటూ వారిని అడగటంతో పోలీసులు అవాక్కై అక్కడున్న 15 మందిని అరెస్టుచేసి రూ.33 వేలు డబ్బులు, రెండుకార్లు, బైకులు సీజ్ చేశారన్నారు.

ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో జరిగిన గొడవలకు మూలకారకుడు విజయ్ అన్నారు. పోలింగ్ రోజున బయటి నుంచి బౌన్సర్లను తీసుకొచ్చి మున్సిపల్ హైస్కూలు పోలింగ్ కేంద్రం వద్ద గొడవ జరిగేందుకు కారణమయ్యాడని పేర్కొన్నారు. ఇతనే ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలకు ఫోన్‌చేసి మీకు ఎంత వస్తుంది, మాకు నెలకు ఎంత ఇస్తారు అని అడుగుతున్నాడని చెప్పారు. ఎన్నికల పోలింగ్ రోజున ఇదే విజయ్ తన హాస్పిటల్ ముందు కార్ల అద్దాలు పగులకొట్టి అప్పుడున్న డీఎస్పీతో చెవిలో మాట్లాడే వీడియోలు కూడా తనవద్ద ఉన్నాయని, అప్పటి గొడవలకు మూలకారకుడని ఇతడేనని చెప్పారు. ఇటువంటి పనులతో ఎమ్మెల్యే చదలవాడ నియోజకవర్గాన్ని ఎక్కడకు తీసుకెళుతున్నారని ప్రశ్నించారు. మట్కా ఆడుతున్న ఐదుగురు టీడీపీ కార్యకర్తలను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారన్నారు. ఇసుక గతంలో టన్ను రూ.700లకు విక్రయించగా ఇప్పుడు రూ.1200లకు అమ్ముతున్నారని, దీనిపై ఎమ్మెల్యే పన్నులు అధికం అన్నారు.

నాపై ఆరోపణలు నిరూపించు

గత ప్రభుత్వంలో నేను రూ.2 వేల కోట్లు, ప్రభుత్వ భూమి దోచుకున్నానంటూ ప్రతిపక్షంలో తనపై అరవిందబాబు ఆరోపణలు చేశాడని, ఇప్పుడు అధికారంలో ఉన్నది అతనేనని, ధమ్ము, ధైర్యం ఉంటే తనపై ఏసీబీ, సీబీఐ, ఈడీ, సీబీసీఐడీ సంస్థలచే దర్యాప్తు చేయించి రుజువు చేయాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఓపెన్ చాలెంజ్ విసిరారు. తనపై వదంతులు పుట్టించి కుట్రతో బురదచల్లారన్నారు. ఇప్పుడు నరసరావుపేటలో ఏమిజరుగుతుందో..కోడిపందాలు, పేకాట శిబిరాల గురించి ఎల్లోమీడియానే రాస్తుందన్నారు. ఇటీవల తమ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అరవిందబాబును కలువగా సంపాదించుకునేందుకు అవకాశాలు ఏమిటో చెప్పాలని కోరాడని, పరిస్థితి ఏమిటో నియోజకవర్గ ప్రజలు అర్థం చేసుకోవాలని డాక్టర్ గోపిరెడ్డి కోరారు.

వరద బాధితులకు సహాయం



వస్తువులను వాహనంలో తరలిస్తున్న అధికారులు, సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల): విజయవాడ వరద బాధితుల సహాయార్థం తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వారు సంయుక్తంగా కలిసి సుమారు రూ.1.30 లక్షలు విలువ గల బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు వినుకొండ మండల కేంద్రం నుంచి దాతల సహాయ సహకారాలతో విజయవాడకు తరలించారు. వరద బాధితులకు సహకారాలు అందించినవారిలో దిలీప్‌కుమార్, ఇండో నాకోఫ్ కెమికల్స్ లిమిటెడ్, క్రషర్ అసోసియేషన్, మాదినేని ఆంజనేయులు (ఏనుగుపాలెం), వినుకొండ ఫర్టిలైజర్ అసోసియేషన్, దాల్ మిల్ అసోసియేషన్, నలబోతు రవి (అందుగులపాడు), కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, గోల్డ్ షాప్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు వినుకొండకు చెందిన మూలె వెంకటేశ్వరరెడ్డి, పొట్ల రాధాకృష్ణమూర్తి, ఇమ్మడిశెట్టి సూరిబాబు, పెనుగొండ శ్రీనులు ఉన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి పేపర్ బాయ్‌కు సన్మానం



నరసరావుపేట: ప్రపంచ పేపర్‌బోయ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బరంపేట మిట్టబజారుకు సాక్షి దినపత్రిక పేపర్‌బాయ్‌గా ఉన్న కె.దుర్గా నారాయణను లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డీ మహమద్ అబ్దుల్‌హై ఫరూఖీ దుశ్శాలువతో సన్మానించి అభినందించారు. దివంగత రాష్ట్రపతి, మిస్సైల్‌మాన్, భారతరత్న అబ్దుల్ కలామ్ మాదిరిగానే కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయికి చేరాలని ఆయన దుర్గానారాయణను కోరారు. అబ్దుల్‌హై ఫరూఖీ సాక్షి దినపత్రిక చందాదారునిగా 2011 జనవరి ఒకటవ తేదీ నుంచి కొనసాగుతున్నారు. ప్రతిరోజూ మాదిరిగానే దినపత్రిక అతనింటికి వేసేందుకు వెళ్లిన దుర్గా నారాయణను ఆయన సన్మానించారు. అబ్దుల్‌హై ఫరూఖీ ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలలో టైపిస్టుగా ఉద్యోగం నిర్వహించి పదవీ విరమణ చేశారు. ఉర్దూ అభివృద్ధికి కృషి చేసినందుకు గాను అతనికి 2021లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును పొందారు. తనకు జరిగిన సన్మానికి పేపర్‌బాయ్ నారాయణ ఫరూకీకి అభినందనలు తెలియచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన బారికేడ్లను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇరువురు గాయాలపాలైన సంఘటన గణపవరం గ్రామంలోని జంక్షన్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన యలవర్తి వెంకటరామరాజు, తన మిత్రుడు పోతురాజు శివనాగేశ్వరరావులు చిలకలూరిపేట నుంచి తమ ద్విచక్రవాహనంపై గణపవరం వస్తున్నారు. ఈ క్రమంలో గణపవరం క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన ఇనుప డ్రమ్ములను ఢీకొన్నారు.

ఈ ప్రమాదంలో ఇరువురూ సుమారు 10 అడుగుల మేర పైకిలేచి 20 అడుగుల దూరంలో పడిపోయారు. ఈ ప్రమాదంలో వెంకటరామరాజుకు తీవ్ర గాయాలుకాగా స్వల్పగాయాలైన శివనాగేశ్వరరావును చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం వెంకటరామరాజును గుంటూరుకు తరలించారు.

యువకుడి ఉసురు తీసిన కుటుంబ కలహాలు

నరసరావుపేట రూరల్: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఆర్‌కేటీ కాలనీ సమీపంలో జరిగిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలోని ఐలాబజార్‌కు చెందిన ఉప్పు శ్రీకాంత్ (30)కు తన భార్య శ్రావణితో మంగళవారం స్వల్ప వాగ్వివాదం చేసుకొంది. దీంతో ఇంట్లో నుంచి వచ్చిన శ్రీకాంత్ ఎస్‌ఆర్‌కేటీ కాలనీ సమీపంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం ఈ సమాచారాన్ని శ్రీకాంత్ తన బంధువులకు తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం శ్రీకాంత్ మృతి చెందాడు.

సదరన్ క్యాంప్‌నకు హాజరైన దివ్యాంగులు

బొల్లాపల్లి : సదరన్ ధ్రువీకరణ పత్రాలు రీ వెరిఫికేషన్ పేరుతో నోటీసులు జారీ చేసిన దివ్యాంగులు మూడు రోజుల పాటు నిర్వహించిన సదరన్ క్యాంప్‌లకు హాజరయ్యారు. మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన 220 మంది పింఛన్ పొందుతున్న దివ్యాంగులు సదరన్ క్యాంప్‌కు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎంపీడీవో షేక్ గౌసియాబేగం ద్వారా వెల్లటూరు సచివాలయ సిబ్బంది గత నాలుగు రోజుల క్రితం పింఛన్‌దారులకు నోటీసులు అందజేశారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించే సదరన్ క్యాంప్‌కు హాజరుకావాలని అధికారుల సూచనల మేరకు ఆగస్టు 31, సెప్టెంబరు 2, 4న జరిగిన సదరన్ క్యాంప్‌లకు దివ్యాంగులు హాజరయ్యారు. 220 మంది పింఛన్‌దారులకు గాను 160 మంది సదరన్ క్యాంప్‌కు హాజరయ్యారని ఈవోపీఆర్‌డీ షేక్ జిలానీబాషా ఈ మేరకు తెలిపారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో ఎముకలు, కీళ్లకు సంబంధించిన విభాగాల్లో మాత్రమే పరీక్షలు జరిగాయని, చెవి,ముక్కు, గొంతు, న్యూరో వంటి సమస్యలకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాల్సిందిగా స్థానిక వైద్యులు తెలిపారని దివ్యాంగులు తెలిపారు. సదరన్ క్యాంప్ ధ్రువీకరణ పత్రం జారీ అనంతరం సెప్టెంబరు నెల నుంచి అర్హులైన దివ్యాంగులకు పింఛన్ అందజేస్తామని ఈవోపీఆర్‌డీ తెలిపారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

బొల్లాపల్లి: వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలో వినాయక విగ్రహ మండపాలు ఏర్పాటు చేయదలచిన వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాకపోకలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. శాంతియుతంగా, సామరస్యంగా ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ తెలిపారు.

లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోండి

చిలకలూరిపేట:మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెక్‌బౌన్స్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని కోరారు.

ప్రపంచంలో అతిపెద్దపార్టీ బీజేపీ

నరసరావుపేట: ప్రపంచంలో అతిపెద్దపార్టీగా భారతీయ జనతాపార్టీ ఉందని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాలలో దేశ ప్రయోజనాలే లక్ష్యంగా సుస్థిర పాలనతో సూపర్‌పవర్ దిశగా ఎదుగుతుందని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్‌రాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక శివునిబొమ్మ సెంటర్‌లో జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జ్ కొక్కెర శ్రీనివాస్, ఒంగోల్ జిల్లా ఇన్‌ఛార్జి పునుగుళ్ల రవిశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరాంకుశం శ్రీనివాస్, స్టేట్ బిల్డింగ్ కమిటీ మెంబర్ నలబోతు వెంకట్రావు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ వల్లెపు కృపారావు, జిల్లా సంయోజక్ బి. ఆదినారాయణ రావు, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పోట్రు పూర్ణచంద్రరావు, జిల్లా సభ్యత్వ సహ ప్రముఖ్ మేకల హనుమంతరావు, ఆరే వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా

నరసరావుపేట రూరల్: విజయవాడలోని వరద బాధితులకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల అండగా నిలిచింది. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో 12వేల ఆహార పొట్లాలను సిద్ధంచేసి జిల్లా రెవిన్యూ అధికారి వినాయకంకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా విజయవాడ నగరంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వెంకటేశ్వర్లు, ఏవో శ్రీధర్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో...

వరద బాధితుల సహాయార్థం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో వాటర్‌బాటిల్స్, క్యాండిల్స్, అగ్గిపెట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లును సేకరించారు. రూ.లక్ష విలువైన వాటర్ ప్యాకెట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, ఇతర నిత్యావసర వస్తువులను సేకరించి అందజేశారు.

బాధితులకు ఎమ్మెల్యే నిత్యావసరాల వితరణ



విజయవాడలో బాధితులకు సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడాన్ని మించిన సేవ మరేముంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం వరదలతో అతలాకుతలమైన విజయవాడ నగరంలోని 40వ డివిజన్లో ఇంటింటికీ వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధితులకు బియ్యం, కందిపప్పు, వంటనూనె, మంచినీళ్లు, పంచదార, టీపొడితో కూడిన కిట్లను గడపగడపకూ వెళ్లి బాధితులకు అందించి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఇప్పటికే తాగునీటి ట్యాంకర్లను పంపించామని చెప్పారు. రెండు రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నానన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఊహించడం అసాధ్యమని, కానీ బాధిత ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. పంపిణీలో నాయకులు నల్లపాటి రాము, కపలవాయి విజయకుమార్ పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి ఉన్నతమైనది

నరసరావుపేట ఈస్ట్: నర్సింగ్ వృత్తి ఉన్నతమైనదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పీఎన్‌సీ అండ్ కెఆర్ విద్యాసంస్థలో బి.ఎస్సీ (నర్సింగ్), జీఎన్‌ఎం విద్యార్థుల గ్రాడ్యుయేషన్, ల్యాంప్ లైటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్ చంద్, జాయింట్ సెక్రటరీ పి.శ్రీనివాసప్రసాదు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, డాక్టర్ చదలవాడ ఆదిత్య, ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపినాథ్, వైస్‌ప్రిన్సిపల్ సుజికల్పన, అధ్యాపకులు పాల్గొన్నారు.